వడ్లు ఎత్తి ఉంటే బతికేటోళ్లు!

కొనుగోలు కేంద్రమే కాష్టమైంది!

- సకాలంలో కాంటాలు వేయని సర్కారు • లోడు ఎత్తక ధాన్యం బస్తాలపై టార్పాలిన్
- కప్పడానికి వెళ్లి పిడుగుపాటుతో తాతామనుమడి మృతి • మెదక్ జిల్లా రామోజిపల్లిలో విషాద ఘటన
- జైనథ్ మండలం గిమ్మ గ్రామంలో మరొకరు.. • పలు జిల్లాల్లో ఈదురు గాలులతో వానలు
- వానకు తడిసిముద్దయిన ఆరబెట్టిన ధాన్యం • విరిగిన భారీ చెట్లు.. ఎగిరిపడ్డ ఇండ్ల పైకప్పులు
- బెల్లూరిలో తెగిపోయిన 33/11 కేవీ విద్యుత్ వైర్లు • ఈవీఎంల పంపిణీ కేంద్రంలో కూలిన టెంట్లు

పాల్వంచ శ్రీరాములు, శివరాజ్ (ఫైల్)

నిర్మల్ జిల్లా పెంబిలో తడిసిన ధాన్యం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ఆరుగాలం కష్టించి పండించిన పంటాయె.. చేతికిన్ని కాసులొస్తే పూట గడుస్తదాయె.. అమ్ముద్దామని వడ్లు తీసుకెళ్లి కొనుగోలుకేంద్రంలో పోసి నాలుగు రోజులు ఎండబెడితే.. ఎట్టకేలకు శనివారం వడ్లు కాంటా వేశారు.. వడ్లు లోడు ఎత్తమే ఇక మిగిలింది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారి వాతావరణం మారింది. వడ్ల బస్తాలు తడుస్తాయని భయపడిన రైతు టార్పాలిన్లు కప్పుదామని తన మనుమడిని వెంటబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి వెళ్లాడు. వాళ్లు వడ్ల బస్తాలపై టార్పాలిన్ కప్పుతుండగా పిడుగుపడటంతో వడ్ల బస్తాలపైనే తాతామనుమడు ఒరిగి మృతి చెందారు. కొనుగోలు కేంద్రమే వారికి కాష్టమైంది. ఈ విషాద ఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు కొని వెంటనే కాంటా వేసి లోడు ఎత్తి ఉంటే తాతామనుమడు బతికేవారు. ఈ పాపం ఎవరిది? పోలీసులు, గ్రామస్థుల వివరాలు ప్రకారం.. రామోజిపల్లి గ్రామానికి చెందిన రైతు పాల్వంచ శ్రీరాములుకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శ్రీరాములు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. యాసంగిలో రెండెకరాల్లో పండించిన వరిని కోసి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు నాలుగు రోజుల క్రితం ధాన్యం తెచ్చాడు. తేమ శాతం ఎక్కువగా ఉన్నదని చెప్పడంతో అక్కడే ఆరబోశాడు. మూడు రోజుల తర్వాత శనివారం ధాన్యం కాంటా చేశారు. వెంటనే ధాన్యాన్ని తరలించక, ఆదివారానికి వాయిదా వేశారు. ఈలోగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని భారీ వర్షం రావడంతో వడ్ల బస్తాలపై టార్పాలిన్లు కప్పడానికి కొనుగోలు కేంద్రం వద్దకు తన మనుమడు (అన్న బిడ్డ కుమారుడు) శివరాజ్‌తో కలిసి వెళ్లాడు. ఆ సమయంలో పిడుగుపాటుకు గురై పాల్వంచ శ్రీరాములు (45)తోపాటు అతని మనుమడు శివరాజ్ (13) ధాన్యం బస్తాల మీద పడి చనిపోయారు. బాలుడు పెద్దశంకరంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్ఐ శరణప్ప, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌కుమార్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారాన్ని అందజేస్తామని భరోసా ఇచ్చారు.

కొత్తగూడలో అత్యధికంగా 9.75 సెం.మీ

హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మేడ్చల్ -మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో సోమవారం వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. ఆదివారం రాష్ట్రంలో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో 9.75 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లిలో 8.98, వరంగల్‌లోని మంగళవారిపేటలో 8.28, హనుమకొండలోని మడికొండలో 6.03, కుమ్రంభీ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌యూలో 5.78 సెం.మీ, కామారెడ్డిలో 4.0 సెం.మీ., కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 3.58 సెం.మీ, సంగారెడ్డిలో 2.9 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 40 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆదిలాబాద్‌లో జిల్లాలో పలుచోట్ల వడగండ్లు

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని బెల్లూరి, బెల్లూరిగూడ, మాకోడ, భరోజ్, జైనథ్, నిరాల, గిమ్మ గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గిమ్మలో నర్సరీ పనుల పరిశీలనకు వెళ్లిన రైతు కూలీలు, నాయకులపై పిడుగు పడటంతో మామిడిపెల్లి కిరణ్ (38) మృతి చెందారు. కోల భోజన్న, కూరేల్లి టిల్లు, కొండ రమేశ్, మంగ సంటెన్నలకు గాయాలయ్యాయి. వీరు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బెల్లూరి గ్రామంలో 33/11 కేవీ విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. చెట్లు విరిగి పడిపోయాయి. పెన్‌గంగ పరీవాహక గ్రామాల్లో రాళ్లవాన కురిసింది. జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది.

కామారెడ్డి జిల్లాలో మోస్తరు వర్షం

కామారెడ్డి జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కామారెడ్డి పట్టణంలో మధ్యాహ్నం వేళ గంటపాటు చిరుజల్లులు పడ్డాయి. మీసాన్‌పల్లి, భిక్కనూరు, శివ్వాపూర్, పెద్దారెడ్డి, మత్తమాల తదితర గ్రామాల్లో మోస్తరు వాన పడింది. గాంధారి మండలం సోమారంతండాలో ఈదురుగాలులకు కెతావత్ గప్పాకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయి పక్కనే ఉన్న ఎద్దుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మాచారెడ్డితోపాటు గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్, ఘన్‌పూర్, అక్కాపూర్, పాల్వంచ, భవానీపేట, చుక్కాపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దోమకొండ మండలంలో తేలికపాటి వర్షం కురిసింది. బీబీపేట్ మండలంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

ఆసిఫాబాద్‌లో గాలివాన బీభత్సం

ఆసిఫాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. పీటీజీ పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల సామగ్రి, ఈవీఎంల పంపిణీ కేంద్రంలో టెంట్లు కూలిపోయాయి. వర్షపు నీరు నిలవడంతో ఎన్నికల అధికారులు ఇబ్బందులుపడ్డారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్ వద్ద రేకుల కప్పు ఎగిరి రోడ్డుపై పడింది. కాలనీలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పొట్టిశ్రీరాములు చౌక్‌లో ఓ చెట్టు విరిగి రోడ్డుపై పడగా, రాకపోకలకు ఆటంకం కలిగింది. సందీప్‌నగర్‌లోని శాంతినికేతన్ పాఠశాల సమీపంలో చెట్టు విరిగి విద్యుత్తు స్తంభంపై పడింది. గుండి వాగుపై తాత్కాలిక వంతెన వర్షపు ప్రవాహానికి కొట్టుకుపోయింది. తుంపల్లికి చెందిన పొలవేని బీరయ్య ఇంటిపై చెట్టు విరిగిపడింది. ఆ సమయంలో భార్యాభర్తలిద్దరూ బయటకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. జైనూర్ మండలంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

గాలివాన, పిడుగుల నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితోపాటు పలు జిల్లాల పరిధిలో ఆదివారం గాలివాన, పిడుగులు పడి సంభవించిన నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. మెదక్ జిల్లాలో పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన ఘటనపై సీఎం విచారం వ్యక్తంచేశారు. వారి కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నేడు వర్ష సూచన

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ నాలుగో విడుత ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం జరుగనున్నాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి కూడా ఉపఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రాగల నాలుగు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం ఇందూర్‌పల్లిలో చెట్టును తొలగిస్తున్న స్థానికులు

ధాన్యం కొనాలని రైతుల రాస్తారోకో

- **గంటపాటు భారీగా నిలిచిపోయిన వాహనాలు**

చిన్నశంకరంపేట, మే 12: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట కొనుగోలు కేంద్రం వద్ద ఆదివారం రైతులు మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రంలో వారం పది రోజులుగా ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళారుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ధాన్యం తూకం వేయకపోవడం లేదని ఆరోపించారు. తమ ధాన్యాన్ని తూకం వేయకుంటే సోమవారం జరిగే ఎంపీ ఎన్నికల్లో తాము ఓటింగ్‌లో పాల్గొనబోమని తేల్చిచెప్పారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అకాల వర్షంతో తడసి ముద్దవుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దళారులపై ఉన్న ప్రేమ రైతులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. తమ ధాన్యాన్ని తూకం వేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని అన్నదాతలు హెచ్చరించారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	44.0°c	26.0°c
ఆదిలాబాద్	43.0°c	22.0°c
నిజామాబాద్	42.4°c	29.8°c
నల్లగొండ	41.7°c	31.7°c
మహబూబ్‌నగర్	40.1°c	28.3°c
మెదక్	40.2°c	25.8°c
రంగారెడ్డి	40.0°c	23.8°c
వరంగల్	38.0°c	27.0°c
కరీంనగర్	38.0°c	27.0°c
హైదరాబాద్	37.8°c	27.7°c

భద్రాద్రి జిల్లా సారపాక-మోతె పట్టీనగర్ వద్ద కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కల్వర్టులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- **ముగ్గురికి తీవ్రగాయాలు**
- **భద్రాద్రి జిల్లా సారపాక-మోతె వద్ద ప్రమాదం**

సారపాక, మే 12: ఆటో అడ్డురావడంతో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. ఈ ఘటన భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక-మోతెపట్టీనగర్ మధ్య ఆదివారం చోటుచేసుకుంది. మణుగూరు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు (టీఎస్ 28 టీఏ 2219) 35 మంది ప్రయాణికులతో భద్రాచలం వెళ్తున్నది. సారపాక-మోతె పట్టీనగర్ గ్రామాల మధ్యలో ఓ కల్వర్టు వద్దకు రాగానే ఎదురుగా ఓ ఆటో అడ్డువచ్చింది. దీంతో అదుపు తప్పిన బస్సు పక్కనే ఉన్న కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి తీవ్రగాయాలు, 20 మందికి స్వల్పగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ స్థానిక నాయకుడు, బూర్గంపహాడ్ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను భద్రాచలం ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతిన్నది.

కాంగ్రెస్‌లో కనిపించని జోష్

- **పోలింగ్‌కు ముందే నేతలు, క్యాడర్ డీలా**
- **కనిపించని అసెంబ్లీ ఎన్నికల నాటి ఊపు**
- **కేసీఆర్ బస్సు యాత్రతో సీన్ రివర్స్**
- **ప్రజల్లో బీఆర్ఎస్‌కు పెరిగిన ఆదరణ**
- **రేవంత్‌రెడ్డిలోనూ కనిపించని విశ్వాసం**
- **కీలక స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు ఎదురుగాలి**

హైదరాబాద్, మే 12(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల జోష్ తగ్గిందా? ఫలితాలపై నమ్మకం సడలిందా? మొన్నటి వరకు తిరుగులేదనుకున్న నేతలకు ఇప్పుడు తత్వం బోధపడిందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలోని కాంగ్రెస్‌కు, ప్రస్తుత కాంగ్రెస్‌కు పొంతన లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఎన్నికల్లో జోష్‌తో పనిచేసిన నేతలు, కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం డీలా పడ్డారని చెప్తున్నారు. కాంగ్రెస్ వెనకబడడమే ఇందుకు కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని మొక్కుబడిగా నిర్వహించారని, కార్యకర్తలు కూడా మనస్ఫూర్తిగా పనిచేయలేదని సొంత పార్టీ నేతలే చెప్పుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి, బేల వ్యాఖ్యలు కార్యకర్తల మనోబలాన్ని దెబ్బతీశారన్న చర్చ జరుగుతున్నది. రేవంత్‌రెడ్డిలోనూ గతంలోని ఉత్సాహం ఇప్పుడు కనిపించలేదని గుర్తుచేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా భావించిన రేవంత్‌రెడ్డి అపనమ్మకంతోనే అక్కడికి అరడజనుసార్లు పర్యటించి ప్రచారం చేశారని పేర్కొంటున్నారు. ప్రతి సభలోనూ దేవుడిపై ఒట్లు వేయడం, వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించడం వంటి సానుభూతి మాటలు సొంత నేతలు, కార్యకర్తల్లో గెలుపుపై అపనమ్మకాన్ని పెంచాయని చెప్తున్నారు.

కాంగ్రెస్‌లో కేసీఆర్ బస్సుయాత్ర కల్లోలం

అసెంబ్లీ ఎన్నికల్లో 64 సీట్లను గెలుచుకొని అత్తెసరు మెజార్టీతో బయటపడిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తమకు తిరుగులేదని, ప్రజలంతా తమవైపే ఉన్నారనే భ్రమలో పడిపోయింది. అందులో ఉండగానే ఐదు నెలల కాలం గడిచిపోయింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కార్యక్షేత్రంలోకి దిగగానే కాంగ్రెస్ బేలతనం బయటపడింది. కేసీఆర్ బస్సుయాత్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఈ యాత్రతో కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల ఊపుతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలవచ్చని భావించిన రేవంత్‌రెడ్డి అండ్ కో ఆశలపై కేసీఆర్ నీళ్లు చల్లారు. బస్సుయాత్ర చేసిన కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా ఉద్యమ నేతకు నీరాజనాలు పలికారు. బీఆర్ఎస్, కేసీఆర్ పని ఖతమైందని సంతోషపడిన కాంగ్రెస్‌కు బస్సుయాత్రలో కేసీఆర్‌కు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ చూసి చూసి దిమ్మతిరిగింది. అప్పటి వరకు పార్లమెంట్ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ అని భావించిన కాంగ్రెస్ నేతలకు తత్వం బోధపడింది. పడిలేచిన కెరటంలా కేసీఆర్ మళ్లీ తన మార్క్ రాజకీయంతో తిరిగి వచ్చారు.

హామీలే కొంప ముంచుతాయా?

అసెంబ్లీ ఎన్నికల్లో గట్టెక్కేందుకు కాంగ్రెస్ ఇచ్చిన అలవిగాని హామీలే ఇప్పుడు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ 13 హామీలు ఇచ్చింది. వీటన్నింటినీ 100 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రకటించి నాలుగింటిని మాత్రమే అమలుచేసింది. మహిళలు, రైతులు, వృద్ధుల్లో వ్యతిరేకతకు ఇది కారణమైందని చెప్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందిలేని నాలుగు హామీలను అమలు చేసి, ఆర్థికంగా భారమయ్యే హామీలను పక్కనపెట్టిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరీ ముఖ్యంగా వరికి రూ. 500 బోనస్, రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, మహిళలకు రూ. 2500 వంటివి అమలు చేయకపోవడంతో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

రోడ్డు ప్రమాదంలో టీవీ సీరియల్ నటి మృతి

- **డివైడర్‌ను ఢీకొన్న కారు**
- **మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన**
- **'త్రినయని'లో తిలోత్తమ పాత్రతో ఫేమస్**

భూత్పూర్, మే 12: రోడ్డు ప్రమాదంలో టీవీ సీరియల్ నటి పవిత్రాజయరాం మృతి చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం శేరిపల్లి (బీ) వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. పవిత్రా జయరాం (42) కర్ణాటకలోని బెంగళూరు నుంచి చెల్లెలు కూతురు ఆపేక్ష, సహనటుడు చంద్రకాంత్, డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి శనివారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరింది. అర్ధరాత్రి శేరిపల్లి(బీ) వద్ద డివైడర్‌ను ఢీకొని.. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్న వనపర్తి డిపో ఆర్టీసీ బస్సును గుద్దుకున్నది. ఈ ప్రమాదంలో పవిత్రతోపాటు కారులో ఉన్నవారందరూ గాయపడ్డారు. 108లో మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించగా..పవిత్ర అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పవిత్ర జీ తెలుగులో ప్రసారమవుతున్న 'త్రినయని', 'నిన్నేపెళ్లాడుతా' సీరియల్స్‌లో నటించింది. మృతురాలికి భర్త శివకుమార్‌గౌడ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

కర్ణాటకలోని మండ్య ప్రాంతానికి చెందిన పవిత్ర.. కన్నడ టీవీ పరిశ్రమ ద్వారా ప్రేక్షకులకు పరిచయమయ్యారు. కన్నడలో 'జోకలి' సీరియల్‌తో నటనా జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. 'రోబో ఫ్యామిలీ', 'గాలిపటా', 'రాధారామన్', 'విద్యా నాయక' సహా పలు కన్నడ సీరియళ్లలో ప్రేక్షకుల మనసులను గెలిచారు.

పోలవరం ముంపు సర్వేపై ఏపీ పేచీ!

- **కేంద్ర జల్‌శక్తిశాఖ ఆదేశాలు బేఖాతర్**
- **సంయుక్త సర్వేకు ఆదేశించి ఏడాది**
- **ఇప్పటికీ స్పందించిన ఏపీ సర్కారు**
- **చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, మే12 (నమస్తే తెలంగాణ): పోలవరం ప్రాజెక్టు ముంపు, బ్యాక్ వాటర్ ప్రభావం అంశాలపై ఏపీ ఆది నుంచీ మీనమేషాలు లెక్కిస్తున్నది. ముంపుపై సర్వే చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూనే, అడుగు కూడా ముందుకేయడం లేదు. సర్వే చేయిస్తామని చెప్పిన కేంద్రజల్‌శక్తి శాఖ మౌనం వహిస్తున్నది. సీజన్ ముంచుకొస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై మొద్దు నిద్రపోతున్నది. జాయింట్ సర్వే చేయించే అంశంపై అటు పీపీఏను, ఇటు కేంద్రాన్ని సంప్రదించిన దాఖలాల్లేకుండా పోయాయి. పోలవరం ప్రాజెక్టుకు ముంపుతోపాటు, అనేక సాంకేతిక అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అన్ని రాష్ట్రాలతో ఏకాభిప్రాయం సాధించాలని కోర్టు ఆదేశించింది. సీడబ్ల్యూసీ పలుమార్లు అన్ని రాష్ట్రాలతో సమావేశం నిర్వహించగా, తెలంగాణ బలమైన వాదనలు వినిపించింది. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణకు భారీగా ముంపు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నది. ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ వద్ద నీటిని నిల్వ చేసిన సందర్భంలో 891 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని, మారిన డ్యామ్ డిశ్చార్జి డిజైన్ వల్ల ముంపు పెరిగే అవకాశం ఉందని వాదించింది. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోతున్నదని, భద్రాచలం వద్ద ఊహించిన దానికంటే ఎక్కువ వరద వచ్చిందని తెలిపింది. బ్యాక్ వాటర్ ఎఫెక్ట్ కారణంగా నదీ తీరాలు, 31 ఇతర ప్రధాన, మధ్యస్థ వాగుల వెంబడి డ్రైనేజీ రద్దీ సమస్య ఉంటుందని పేర్కొన్నది. ప్రధాన నది వరదల ప్రభావం 60 గ్రామాలపై ఉంటుందని తెలంగాణ ఆది నుంచీ డిమాండ్ చేస్తున్నది. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సీడబ్ల్యూసీకి ఆధారాలతో విన్నవించింది. 2018, 2020, ఎన్జీటీ ఆర్డర్లకు అనుగుణంగా జరిపిన అధ్యయనం ఫలితాలను తెలంగాణ ఊటంకించింది. భద్రాచలం వరదలను కూడా ఉదహరించింది. ఎట్టకేలకు తెలంగాణ వాదనలతో కేంద్రం ఏకీభవించడంతో, జాయింట్ సర్వే చేపట్టాలని పీపీఏ, ఏపీ ప్రభుత్వానికి కేంద్ర జలసంఘం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది.

జాయింట్ సర్వేకు అనేక కొర్రీలు

పోలవరం బ్యాక్ వాటర్ ఎఫెక్ట్‌పై ఉమ్మడి సర్వే చేపట్టేందుకు ఏపీ, పీపీఏ ఆది నుంచీ తాత్సారం చేస్తున్నది. ఒకదశలో సర్వే చేసేది లేదని తేల్చి చెప్పాయి. సీడబ్ల్యూసీ జోక్యం చేసుకుని ఏపీని సమన్వయంతో సంయుక్త సర్వే చేపట్టాలని పీపీఏకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో అయిష్టంగానే జాయింట్ సర్వేకు పీపీఏ, ఏపీ అంగీకరించాయి. అయినా కొర్రీలు పెడుతూ జాప్యం చేస్తున్నది. సీడబ్ల్యూసీ మరోసారి ఉమ్మడి సర్వేకు నియమిత కాలపరిమితిని విధి స్తూ పీపీఏకు అల్టీమేటం జారీ చేసింది. తొలుత తెలంగాణ, ఏపీలతో సమావేశం నిర్వహించి, ఉమ్మడి సర్వే ను చేపట్టాలని నొక్కిచెప్పింది. ఏపీ సహకరించకపోయినా సర్వే బాధ్యత పీపీఏదేనని తేల్చిచెప్పి ఏడాది గడిచింది. సీడబ్ల్యూసీ అల్టీమేటంతో పీపీఏ, ఏపీ కొంత హడావుడి చేసి జాయింట్ సర్వేకు ప్రత్యేక అధికార బృందాన్ని నియమించాయి. సర్వేకు తేదీలను తెలియజేయాలని తెలంగాణకు సమాచారం అందించాయి. తీరా సర్వే చేసేందుకు వచ్చిన ఏపీ మళ్లీ పేచీ పెట్టింది. తెలంగాణ డిమాండ్ల మేరకు సర్వే చేయడం కుదరదని, పోలవరం ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ 150 అడుగుల మేరకు నీటినిల్వ వల్ల గతంలో బూర్గంపాడు వరకు తేల్చిన ముంపు వరకే సర్వే చేస్తామని కొర్రీ పెట్టి సర్వే నిలుపుదల చేసింది. సీడబ్ల్యూసీ సూచన మేరకు సర్వే కుదరదని, ఒకవేళ అదే చేస్తే జాతీయ ప్రాజెక్టుపై తీవ్ర ప్రభావం పడుతుందని వితండ వాదానికి తెరలేపి సర్వేను అటకెక్కించింది.

చోద్యం చూస్తున్న కేంద్రం

పోలవరం ముంపుపై సర్వేకు ఏపీ ఆది నుంచీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. కేంద్రం ఆదేశాలను అమలు చేయడంలో పీపీఏ కూడా ప్రేక్షకపాత్రనే పోషిస్తున్నది. ఇదే విషయమై బీఆర్ఎస్ ప్రభుత్వం పీపీఏకు అనేక సార్లు లేఖలు రాసినా స్పందన లేదు. పీపీఏ నిర్లక్ష్యం, ఏపీ కాలయాపన, జాయింట్ సర్వే ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న తీరుపై కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అయినా కేంద్రం ఎలాంటి చర్య లు తీసుకోకుండా కేవలం లేఖలు రాస్తూ చేతులు దులుపుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ విషయంపై దృష్టి సారించిన దాఖలాలు కూడా లేవు. మరోవైపు సీజన్ సమీపిస్తున్నందున ఇప్పటికైనా సర్వేకు ఏపీపై ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ ఇంజినీర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రియల్.. ఢమాల్!

స్థిరాస్తి రంగంలో భారీ కుదుపు.. భూముల క్రయవిక్రయాలపై దెబ్బ

- **వ్యాపారుల్లో ఆర్ఆర్ ట్యాక్స్ భయం**
- **కరెంటు కోతలతో కంపెనీలు వెనక్కి**
- **సర్కారు నిర్ణయాలతో పునరాలోచన**

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గత డిసెంబర్ వరకు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లిన 'రియల్' వ్యాపారంలో ఈ ఐదు నెలల కాలంలో స్తబ్ధత నెలకొన్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంబద్ధ నిర్ణయాలతో స్థిరాస్తి రంగం కుదేలైంది. ఇది ఇలాగే కొనసాగితే 'తెలంగాణల